సాక్షి జగిత్యాల

శనివారం । 30 । ఆగస్టు । 2025

కుంకుమపూజ

జగిత్యాలటౌన్: గణేశ్ నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం జగిత్యాల పట్టణంలోని పలు మంటపాల వద్ద సామూహిక కుంకుమపూజలు నిర్వహించారు. పద్మనాయక కల్యాణ మంటపం, ఎల్‌జీ గార్డెన్స్ కల్యాణమంటపం, వినాయకనగర్‌కాలనీ గణనాథులతో పాటు పట్టణంలోని పలు మంటపాల వద్ద మహిళలు పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

సత్వర న్యాయం అందితేనే కోర్టులపై నమ్మకం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి రత్న పద్మావతి

జగిత్యాలజోన్: కక్షిదారులకు సత్వర న్యాయం జరిగితేనే కోర్టులపై నమ్మకం పెరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.రత్న పద్మావతి అన్నారు. జగిత్యాల రెండవ అదనపు జ్యూడీషియల్ మేజిస్ట్రేట్‌గా నియమితులైన కరంజియా నిఖిషాకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, పెండింగ్ కేసుల సంఖ్యను వీలైనంతగా తగ్గించేందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు కృషి చేయాలన్నారు. కోర్టు బెంచ్‌కు పూర్తి స్థాయిలో సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సబ్ జడ్జి వెంకటమల్లిక్ సుబ్రహ్మణ్యశర్మ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి లావణ్య, మొదటి అదనపు, రెండో అదనపు జ్యూడీషియల్ మేజిస్ట్రేట్‌లు శ్రీనిజ, నిఖిషా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాచకొండ శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి అందె మారుతి, న్యాయవాదులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

ధర్మపురి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం ధర్మపురిలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా ల్యాబ్‌లో పరీక్షల వివరాలు తెలుసుకున్నారు. ఫార్మసీ విభాగంలో అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. రోజూ ఔట్, ఇన్ పేషంట్ల రికార్డులు పరిశీలించారు. జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రవీందర్, ఆర్‌ఎంవో డాక్టర్ రామకృష్ణ తదితరులున్నారు.

పరిహారం అందించేలా ప్రభుత్వంతో మాట్లాడుతా

- మాజీ మంత్రి జీవన్‌రెడ్డి



గోదావరి ఉధృతిని పరిశీలిస్తున్న జీవన్‌రెడ్డి

సారంగాపూర్(జగిత్యాల): గోదావరి ఎన్నడూ లేనంతగా ఉప్పొంగినా అధికారుల సమన్వయంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీర్‌పూర్ మండలం కమ్మునూర్ వంతెన వద్ద గోదావరి ఉధృతిని, అనంతరం గ్రామాల్లో వరదలకు నష్టపోయిన పంటలను, రోళ్లవాగు ప్రాజెక్టు ప్రధాన కాలువకు పడిన బుంగ ప్రాంతాన్ని పరిశీలించారు. భారీ వరదలకు పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని, క్షేత్రస్థాయిలో సర్వే చేయించి రైతులకు పరిహారం అందించేలా ప్రభుత్వంతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తాను ఆర్ అండ్‌బీ మంత్రిగా కమ్మునూర్–కలమడుగు వంతెన నిర్మించడం జరిగిందని, బోర్నపల్లి బాధనకుర్తి వంతెనల నిర్మాణాలు పూర్తి చేసే అవకాశం తనకు దక్కడం సంతోషంగా ఉందన్నారు. గోదావరిపై కమ్మునూర్–కలమడుగు (మంచిర్యాల జిల్లా) వంతెన రెండు గ్రామాలకు కలిపి ఉండగా, కలమడుగు ప్రజలను అక్కడికి వెళ్లి కలిశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌తో ఫోన్‌లో మాట్లాడారు. నాయకులు రమేశ్, నవీన్‌రావు, జితేందర్, లక్ష్మణ్‌రావు, రాంచంద్రారెడ్డి, తదితరులు ఉన్నారు.



రాయికల్: వస్తాపూర్‌లో ఇసుక మేటలు



ఇబ్రహీంపట్నం: కోమటికొండాపూర్‌లో నీటమునిగిన మొక్కజొన్న



సారంగాపూర్: రంగసాగర్‌లో నీటమునిగిన పొలం

రాళ్లు రప్పలు.. ఇసుక మేటలు

- వాగులు, చెరువుల ఉధృతితో దెబ్బతిన్న పంటలు
- ఆరుగాలం కష్టం వరదపాలు
- గోదావరి తీర సమీపంలో నీట మునిగిన వైనం



సారంగాపూర్: వరిపొలంలో రాళ్లు, ఇసుకమేటలు



సారంగాపూర్: రంగసాగర్‌లో నీటమునిగిన పత్తి



జగిత్యాలఅగ్రికల్చర్: వీరాపూర్‌లో నాటు వేసిన పొలంలో ఇసుక మేటలు



ఇబ్రహీంపట్నం: కోమటికొండాపూర్‌లో వరదనీటిలో సోయాబిన్

జగిత్యాలఅగ్రికల్చర్/సారంగాపూర్/రాయికల్/ఇబ్రహీంపట్నం: జిల్లాలో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగులు, చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో పంట పొలాల్లో ఇసుక మేటలు వేయగా, మరికొందరి పొలాలు వరద ఉధృతికి నీటిలో మునిగాయి. సాగునీటి కోసం వాగులకు పెట్టిన విద్యుత్ మోటార్లు కొట్టుకుపోయాయి. జిల్లాలో దాదాపు 306 గ్రామాలు ఉండగా, ప్రతీ గ్రామంలో కనీసం 50 ఎకరాల వరకు వరదతో నష్టం జరిగింది. జిల్లాలో 60 వేల ఎకరాల్లో వరి పొలాలు నీటిలో మునిగినట్లు తెలుస్తోంది.

నిండుకుండలా చెరువులు, కుంటలు

- జిల్లాలో సుమారు 1,069 చెరువులు, కుంటలు ఉన్నాయి. జిల్లాలో సాధారణ వర్షపాతం 653.7 మి.మీ కాగా, ఒకట్రెండు రోజుల్లోనే ఆ మేరకు వర్షపాతం నమోదైంది. కొన్నిచోట్ల చెరువులు మత్తడి దూకుతుంటే, మరికొన్ని చోట్ల కుంటలు, వాగులు ఏరులై పారుతున్నాయి.
- జగిత్యాల రూరల్ మండలం అనంతారం వాగు, కోరుట్ల మండలం మోహన్‌రావుపేట, చిన్నమెట్‌పల్లి, పైడిమడుగు వాగు, రాయికల్ మండలం కిష్టంపేట వాగు, సారంగాపూర్ మండలం పెంబట్ల వాగు, గొల్లపల్లి మండలం శెకల్ల, యశ్వంతరావుపేట వాగు పరిసర ప్రాంతాల్లో తీవ్ర నష్టం జరిగింది.
- బీర్‌పూర్ మండలం గోదావరి తీరం వెంట ఉన్న రంగసాగర్, మంగేళ, చిత్రవేణిగూడెం, రేకులపల్లి, చిన్నకొల్వాయి గ్రామాల్లో నష్టం అధికంగా ఉంది. బీర్‌పూర్ మండలంలో 721 ఎకరాలకు పైగా వరి,పత్తి, సారంగాపూర్ మండలంలో 100 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు పేర్కొన్నారు.
- రాయికల్ మండలం వస్తాపూర్‌లో పంట పొలాలు ఇసుక మేటలతో నిండిపోయాయి.
- ఇబ్రహీంపట్నం మండలం కోమటికొండాపూర్, ఎర్దండి గోదావరి పరివాహక ప్రాంతాల్లో సుమారు 500 ఎకరాల్లో మొక్కజొన్న, సోయాబిన్, పసుపు పంటలు నీటమునిగాయి.

వాగు పరిసరాల్లోని రైతులకు భారీ నష్టం

వరి విత్తనాల కొనుగోలు నుంచి నాటు వేసేవరకే ఎకరాకు దాదాపు రూ.25 వేలు ఖర్చు పెట్టారు. ఇప్పుడు పొలాల్లో ఇసుక మేటలను తొలగించేందుకు ఎకరాకు మరో రూ.15 వేలు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఇసుక మేటలను తొలగిద్దామంటే ఎవరి పొలం సరిహద్దు ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి. లోతట్టు ప్రాంతాల పొలాలకు జేసీబీలు, ట్రాక్టర్లు వెళ్లే పరిస్థితి లేదు. అలాగే, వరి నాటు వేసే అదును కూడా దాటిపోతుంది. దీంతో, అక్కడక్కడ వానాకాలం సాగుకు రైతులు పుల్‌స్టాప్ చెప్పే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో రైతులు పంట వేయక ఒక్కో ఎకరాకు దాదాపు రూ.70 వేలుకు నష్టపోతున్నారు.

పొలమంతా ఇసుక మేటలే



రెండెకరాల్లో నాటు వేస్తే, అందులో ఎకరం వరద తాకిడికి ఇసుక మేటలు పెట్టాయి. ఇసుకను ఇప్పటికిప్పుడు తరలించడం సాధ్యం కాక, వదిలేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాగుకు చేసిన కష్టం, విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు కూడా నీళ్లలో కలిసిపోయాయి. ఇప్పుడు పొలంలోని మట్టి తీయించనిదే మళ్లీ పంట వేసే పరిస్థితి లేదు.

– ముక్కెర వినీత్, వీరాపూర్, రాయికల్

పరిహారం ఇవ్వాలి



జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు పొలాలు గట్లు తెగిపోయాయి. వాగులు పొంగి పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. రైతులకు వానాకాలం పంట పండే పరిస్థితి లేదు. కాబట్టి ఆ మేరకు రైతులకు తగిన పరిహారం అందించాలి. ఇసుక మేటలు తొలగించేందుకు అయ్యే ఖర్చును సైతం ప్రభుత్వం ఇవ్వాలి.

– మెక్కొంద రాంరెడ్డి, జిల్లా రైతు సంఘం నాయకుడు

ఎస్సారెస్పీకి 4.30 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



ఎస్సారెస్పీ నుంచి దిగువకు ఉరకలేస్తున్న గోదావరి



ధర్మపురిలో నీటమునిగిన పుష్కరఘాట్లు



ఎర్దండి వద్ద నీటమునిగిన ఆలయాలు

జగిత్యాలఅగ్రికల్చర్/ఇబ్రహీంపట్నం/ధర్మపురి: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు శుక్రవారం సాయంత్రం వరకు ఎగువ ప్రాంతాల నుంచి 4.30 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో ప్రాజెక్టు 39 గేట్లను ఎత్తి 5.50 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. అలాగే, వరద కాలువకు 12 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 8 వేల క్యూసెక్కులు, భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా ఎస్సారెస్పీ నుంచి భారీ స్థాయిలో వరదను దిగువకు వదలడంతో ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి వద్ద గోదావరి ఉధృతికి గ్రామ శివారులోని పంట పొలాలు, నది తీరంలోని గంగామాత, శంకరుడు, శివపార్వతుల ఆలయాలు నీటమునిగాయి. తహసీల్దార్ వరప్రసాద్ గోదావరి ఉధృతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ గ్రామస్తులను అప్రమత్తం చేస్తున్నారు. ఎర్దండి వద్ద ముంపునకు గురయ్యే 62 ఇళ్లకు సంబంధించి సుమారు 250 మందితో శుక్రవారం తహసీల్దార్, ఎస్సై అనిల్ సమావేశం నిర్వహించారు. పునరావాస కేంద్రానికి వెళ్లకుంటే బలవంతంగా తరలిస్తామని అనడంతో.. కొంతమంది బంధువుల ఇళ్లకు వెళ్తామని, మరికొందరు పునరావాస కేంద్రంలో ఉంటామని తెలిపారు.

ధర్మపురిలో ఉగ్రరూపం

ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టుల నుంచి భారీగా నీటిని విడుదల చేయడంతో ధర్మపురి వద్ద గోదావరి ఉగ్ర రూపం దాల్చింది. గురువారం ఉదయం నుంచి పెరిగిన గోదావరి రాత్రి వరకు శాంతించింది. తిరిగి శుక్రవారం మధ్యాహ్నం నుంచి నీటిమట్టం భారీగా పెరిగింది. పుష్కరఘాట్లతో పాటు గోదావరి ఒడ్డు నున్న సంతోషిమాత, దత్తాత్రేయస్వామి, గోదావరి మాత ఆలయాలు నీటమునిగాయి. భక్తులు స్నానాల కోసం నదిలోకి వెళ్లకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

పెద్దపల్లి–నిజామాబాద్ లైన్‌లో ‘వందేభారత్’

- కామారెడ్డి ట్రాక్ రిపేర్ నేపథ్యంలో మళ్లింపు



సాక్షిప్రతినిధి,కరీంనగర్: పెద్దపల్లి–నిజామాబాద్ లైన్‌లో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ పరుగులు తీస్తోంది. రాత్రి 11 గంటలకు ఎగువన ఉదయం 4 గంటలకు దిగువన ఇదే మార్గంలో పెద్దపల్లి బైపాస్ మీదుగా నడుస్తోంది. ఇటీవలే ముంబయి నుంచి జాల్నా వరకు నడుస్తున్న 20706 వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును నాందేడ్ వరకు పొడిగించారు. కానీ.. ఈ రైలు ప్రాథమిక నిర్వహణ చర్లపల్లిలో చేస్తున్నారు. ఇది నాందేడ్ నుంచి చర్లపల్లి వరకు వయా నిజామాబాద్– కామారెడ్డి మార్గంలో ఖాళీ రైలుతో దిగువ వైపు, మళ్లీ వచ్చేటప్పుడు కూడా చర్లపల్లి నుంచి నాందేడ్ వరకు ఖాళీ రైలుతో నడుస్తుంది. రెండు రోజుల క్రితం కామారెడ్డి రైల్వే స్టేషన్‌కు సమీపంలో పట్టాలు వరద నీటిలో కొట్టుకుపోవడంతో నిజామాబాద్ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లే రైళ్ల రాకపోకలు స్తంభించాయి. ఫలితంగా ఈ మార్గంలో నడుస్తున్న పలు రైళ్లను నిజామాబాద్– పెద్దపల్లి బైపాస్–కాజీపేట మార్గంలో దారి మళ్లించి నడుపుతున్నారు. భవిష్యత్తులో ఈ మార్గం గుండా వందే భారత్, నమో భారత్ ర్యాపిడ్, అమృత్ భారత్ లాంటి రైళ్లు ప్రవేశ పెడితే ఈ ప్రాంత ప్రయాణికులకు మరింత సౌకర్యం కలిగే అవకాశం ఉంటుందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు.

గిరిజన తండాల అభివృద్ధికి కృషి

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



వివరాలు తెలుసుకుంటున్న మంత్రి లక్ష్మణ్‌కుమార్, గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ అలుగు వర్షిణి

జగిత్యాల: గిరిజన గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మౌలిక వసతులకు రూ.81 కోట్లతో అంచనాలు రూపొందించారని, పైలెట్‌ప్రాజెక్ట్‌గా జగిత్యాలను ఎంపిక చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ అలుగు వర్షిణితో కలిసి మాట్లాడారు. మండలాల వారీగా విద్య, వైద్యం, విద్యుత్, రోడ్లు, తాగునీరు, వసతుల స్థితిపై నివేదికలు పరిశీలించడం జరిగిందని, ప్రతీ తండాకు రోడ్లు వేయడం జరుగుతుందన్నారు. గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ మట్లాడుతూ, ప్రతీ తండాకు మౌలిక వసతులు కల్పించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ లత, గిరిజన అభివృద్ధి శాఖ అధికారి రాజ్‌కుమార్, ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఎడ్యుకేషనల్ హబ్‌గా వెల్గటూర్

వెల్గటూర్(ధర్మపురి): వెల్గటూర్ మండలాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తానని మంత్రి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పాశిగామ వద్ద రాష్ట్ర రహదారి పక్కన సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఎస్సీ సంక్షేమశాఖ ద్వారా రూ.200 కోట్లతో రెషిడెన్షియల్ కో ఎడ్యుకేషన్ డీఈడీ, బీఈడీ, పారా మెడికల్, న్యాయ కళాశాల ఏర్పాటుకు శుక్రవారం గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ అలుగు వర్షిణి, కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఒకట్రెండు నెలల్లో ప్రభుత్వ అనుమతులు తీసుకొని పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే రెండెకరాల విస్తీర్ణంలో ట్రామా కేర్ ఆస్పత్రి ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ రఘుచందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, నాయకులు తిరుపతి, సందీప్, ఉదయ్, శ్రీకాంత్, రమేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆ శాఖలో అన్నీ ఖాళీలే..

- గిరిజన సంక్షేమ కార్యాలయంలో ఒక్క అధికారి లేరు
- ఉన్న ఇద్దరు డిప్యూటేషన్‌పై..



జిల్లా గిరిజన సంక్షేమ కార్యాలయం

జగిత్యాల: జిల్లా గిరిజన సంక్షేమశాఖ కార్యాలయం ఖాళీలతో కొట్టుమిట్టాడుతోంది. గిరిజన ఆశ్రమ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆ శాఖలో ఒక్క అధికారి లేరు. కాగా జిల్లా ఏర్పడిన అనంతరం డీటీడబ్ల్యూవోగా నీలిమ కొద్దిరోజులు పనిచేశారు. బదిలీపై వెళ్లిపోవడంతో ఆమె స్థానంలో ఎవరూ రాలేదు. ఫుల్ అడిషనల్ చార్జిగా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి రాజ్‌కుమార్‌కు కేటాయించారు. కానీ, ఆ శాఖ సైతం పెద్దది కావడంతో రెండు బాధ్యతల నిర్వహణ కష్టతరంగా మారింది. అంతేకాకుండా ఫుల్ అడిషనల్ చార్జిగా చేద్దామన్నా ఆ శాఖలో ఏ ఒక్క అధికారి లేరు. నిబంధనల ప్రకారం ఆ కార్యాలయంలో ఒక సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు ఆఫీస్ సబార్డినేట్లు ఉండాలి. కానీ అందులో ఒక్కరు సైతం లేరు.

గిరిజన శాఖ కింద 6 పాఠశాలలు

గిరిజన సంక్షేమ శాఖ కింద జిల్లాలో 6 ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌లు నడుస్తున్నాయి. బీర్‌పూర్ మండలం మంగేళ బాలికల ఆశ్రమ పాఠశాలలో 80 మంది విద్యార్థులు, అదే మండలంలోని చిత్రవేణిగూడెంలో బాలుర ఆశ్రమ పాఠశాలలో 70 మంది, రాయికల్ మండలం జగన్నాథపూర్ బాలబాలికల ఆశ్రమ పాఠశాలలో 42, ధర్మపురి బాయ్స్ హాస్టల్‌లో 30 మంది, జగిత్యాల బాలుర హాస్టల్‌లో 80 మంది వరకు విద్యార్థులున్నారు. వీరికి సంబంధించిన వసతులు, ఇతరత్రా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు గిరిజన సంక్షేమ శాఖ ఎంతో అవసరం. ఈ శాఖలో అన్ని ఖాళీలే ఉండడంతో విద్యార్థులకు సైతం ఇబ్బందికరంగా మారిందని చెప్పవచ్చు.

జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్‌కు పూర్తిస్థాయిలో బాధ్యతలు ఇచ్చినా ఆ శాఖలో పూర్తిగా ఖాళీలు ఉండడంతో ఏం చేయలేకపోతున్నట్లు తెలుస్తోంది. కాగా జగిత్యాల బాలుర హాస్టల్‌లో పనిచేస్తున్న వార్డెన్ కరీంనగర్‌కు డెప్యూటేషన్‌పై వెళ్లగా, మరో మహిళ ఉపాధ్యాయురాలు హైదరాబాద్‌లోని కమిషనరేట్‌కు డెప్యూటేషన్‌పై వెళ్లారు. హాస్టళ్లలో సైతం చాలా ఖాళీలున్నాయి. ఖాళీలపై ట్రైబల్ డెవలప్‌మెంట్ కమిషనర్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సిబ్బందిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలోని 6 గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సుమారు 300పైగా విద్యార్థులున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో సిబ్బందిని ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఖాళీలతో ఇబ్బందులు



నాకు గిరిజన సంక్షేమాధికారిగా బాధ్యతలు ఇచ్చినప్పటికీ అందులో పూర్తిగా ఖాళీలు ఉండడం ఇబ్బందికరంగా ఉంది. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. సిబ్బంది ఉంటే వర్క్ ప్రోగ్రెస్‌లో ఇబ్బందులు లేకుండా ఉంటుంది. త్వరలోనే సిబ్బంది ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– రాజ్‌కుమార్, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి



రాయికల్: అల్లీపూర్‌లో సొసైటీ వద్ద చెప్పుల క్యూ



పెగడపల్లి: ధర్నా చేస్తున్న రైతులు

చెప్పుల వరుస.. ఆందోళనలు

పెగడపల్లి/రాయికల్/సారంగాపూర్/ధర్మపురి: యూరియా కోసం రైతులు రోడ్డెక్కారు. పెగడపల్లిలో సహకార సంఘానికి శుక్రవారం యూరియా వచ్చిందన్న సమాచారంతో అక్కడికి తరలివచ్చారు. కేవలం 350 బస్తాలు రావడంతో అంబేడ్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రాయికల్ మండలం అల్లీపూర్‌లో చెప్పులను క్యూలో పెట్టారు. సారంగాపూర్ మండలం రేచపల్లిలో 167 మంది రైతులకు యూరియా పంపిణీ చేశారు. ధర్మపురి మండలం ఆరెపెల్లి పీఏసీఎస్ వద్ద ఉదయం నుంచి పడిగాపులు కాశారు. ఒక్కో రైతుకు ఒక బస్తా ఇస్తామని చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.



సారంగాపూర్: రేచపల్లిలో యూరియా కోసం నిరీక్షణ

మాతృభాషతోనే మనుగడ



కవి రఘువర్మను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

జగిత్యాల: మాతృభాషతోనే మనుగడ సాధ్యమని మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. శుక్రవారం మహిళ డిగ్రీ కళాశాలలో తెలుగు భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తెలుగు భాషను మరువవద్దని, ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చెప్పారు. ప్రముఖ కవి రచయిత రఘువర్మ తెలుగు ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం రఘువర్మను ప్రిన్సిపాల్‌తో పాటు, అధ్యాపక బృందం సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ చంద్రయ్య, సీనియర్ అధ్యాపకుడు రహీం, వరప్రసాద్, వాసవి, సుజాత, నీరజ, జమున పాల్గొన్నారు.

జిల్లాకు మోస్తరు వర్ష సూచన

జగిత్యాలఅగ్రికల్చర్: రాబోయే ఐదురోజుల్లో జిల్లాకు మోస్తరు వర్ష సూచన ఉందని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త బి.శ్రీలక్ష్మి తెలిపారు. ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 3 వరకు జిల్లాలో అక్కడక్కడ ఉరుములు, మెరుపుతో పాటు గంటలకు 30–40 కి.మీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. పగటి ఉష్ణోగ్రతలు 29–31, రాత్రి ఉష్ణోగ్రతలు 24 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యే అవకాశం ఉందని, గాలిలో తేమ ఉదయం 87–93, మధ్యాహ్నం 69–72 శాతం ఉండే అవకాశం ఉందన్నారు.

క్లుప్తంగా

వృద్ధురాలు మృతి

గోదావరిఖని: ఎన్టీపీసీ ఖాజీపల్లి గ్రామానికి చెందిన గుమ్మడి రాజమ్మ(72) మృతిచెందినట్లు గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై అనూష తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానిక బస్టాండ్ సమీపంలో కిందపడి ఉండగా, 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు. తలకు బలమైన గాయంతో మృతి చెందినట్లుగా డాక్టర్లు నిర్ధారించారన్నారు. మృతురాలి కుమారుడు గుమ్మడి లింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిన రాజమ్మ అనూహ్యంగా మృతి చెందినట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



తలపగిలి తీవ్ర రక్తస్రావంతో మల్లేశం

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి నుంచి గంగాధర వెళ్లే డబుల్‌రోడ్డుపై తడగొండ కల్వర్టు పరిసరాల్లో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఇల్లంతకుంట మండలం గాలిపెల్లికి చెందిన మల్లేశం తీవ్రంగా గాయపడడంతో పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు తెలిపిన వివరాలు. బైక్‌పై గంగాధర మండలం కాసారం గ్రామానికి చెందిన ఒకరు, మరో బైక్‌పై ఇద్దరు గంగాధర వైపు వెళ్తున్నారు. కల్వర్టు పరిసరాల్లో వెనుక నుంచి ఓ వాహనం ఢీకొట్టడంతో మల్లేశం తలకు తీవ్ర గాయాలయ్యాయి. మరొకరు సైతం గాయపడ్డాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి మల్లేశంను ఆస్పత్రికి తరలించారు.

వివాహిత ఆత్మహత్య



పుష్పలత(ఫైల్)

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌కు చెందిన ఓ వివాహిత అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బొమ్మకల్‌లోని లక్ష్మీనగర్‌కు చెందిన గూడ మాధవరెడ్డి భార్య పుష్పలత (64) కొంతకాలంగా పార్కిసన్ వ్యాధితో బాధపడుతోంది. వ్యాధి తీవ్రతతో జీవితంపై విరక్తి చెందిన పుష్పలత ఇంట్లోని ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని వివరించారు. భర్త మాధవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

సిరిసిల్లక్రైం: జిల్లా కేంద్రంలో శుక్రవారం బైక్ అదుపుతప్పడంతో ఓ యువకుడు గాయపడ్డాడు. సిరిసిల్లకు చెందిన రాజకుమార్ పాత బస్టాండ్ నుంచి కొత్తబస్టాండ్ వైపు వెళ్తున్నాడు. కోర్టు సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడడంతో తల, కాలుకు గాయాలయ్యాయి. స్పృహ తప్పి పడిపోయిన రాజకుమార్‌ను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జలకాలాట వద్దు!

- జలపాతాల ఉధృతితో జాగ్రత్తలే రక్ష
- ఎగువ నుంచి దిగువ మానేరు వరకు 60 కిలోమీటర్ల నది
- భారీగా ప్రవహిస్తున్న వరదకాలువ
- మిడ్‌మానేరు గేట్ల ద్వారా నీటి విడుదల



మిడ్‌మానేరు నీటి విడుదలతో మానేరు నది

బోయినపల్లి(చొప్పదండి): వరదలతో జిల్లాలో నదులు ఉప్పొంగుతున్నాయి. వరదకాల్వ నిండుగా ప్రవహిస్తుంది. ఇదే సమయంలో నదిని దాటే సాహసం చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. నీటి ప్రవాహం గురించి తెలియక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. జిల్లాలో గోదావరి ఉపనది మానేరునది దాదాపు 60 కిలోమీటర్ల పరిధిలో ప్రవహిస్తోంది. ఈ నదిపై మిడ్‌మానేరు, ఎగువ మానేరు, లోయర్ మానేరు ప్రాజెక్టులు నిర్మించారు. ఎగువమానేరు మత్తడి పోస్తుండగా, మిడ్ మానేరు గేట్లు ఎత్తారు. దీంతో నదిప్రవాహం తీవ్రంగా ఉంది. ఎగువన వర్షాలు కుస్తుండడంతో ఏ క్షణాన నదుల ప్రవాహం పెరుగుతుందో తెలియడం లేదు. నిలకడగా నది ప్రవాహం ఉందనుకుని నది దాటే ప్రయత్నాలు చేస్తే వరద ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో నది దాటలేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్న సంఘటనలు చూస్తున్నాము. ఎగువ మానేరు నది ప్రవాహం భారీగా పెరగడంతో వరదలో చిక్కుకున్న పలువురు హెలికాప్టర్ సాయంతో క్షేమంగా బయటపడ్డ సంఘటన గంభీరావుపేట మండలంలో జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నదులు దాటే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

గేట్లు ఎత్తడంతో నదుల్లో నీరు

భారీ వర్షాలతో ఎస్సారెస్పీతోపాటు మానేరు, మూలవాగుల నుంచి మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఎస్సారెస్పీ నుంచి నీటి విడుదలతో వరద కాలువ నిండుకుండలా మారింది. మిడ్‌మానేరులో 23 టీఎంసీల మేర నీరు చేరింది. మిడ్‌మానేరు గేట్ల ద్వారా ఎల్‌ఎండీకి నీరు విడుదల చేస్తున్నారు. మిడ్‌మానేరు గేట్ల ద్వారా నీరు వదలడంతో మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీ వరకు 20 కిలోమీటర్ల మేర మానేరు నది భారీగా ప్రవహిస్తోంది. నేడో, రేపో ఎల్‌ఎండీ గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల చేసే అవకాశం ఉంది. ఈ సమయంలో ఎల్‌ఎండీ నది ప్రాంతంలో సైతం వరద ప్రవాహం పెరుగుతుంది. ఈ సమయంలో వరదలో చిక్కి ఇబ్బందులు పడకూడదు.

వరద జాగ్రత్తలు ఇవీ..

- ప్రాజెక్టుల సందర్శించే సమయంలో వరదకు దగ్గరగా, దరుల వద్దకు పోవద్దు.
- ప్రాజెక్టుల వద్ద సెల్ఫీలు, ఫొటోలు తీసుకునే విషయంలో పరిసరాలు చూసుకోవాలి.
- గేట్ల ద్వారా నీరు విడుదల అవుతున్న సమయంలో దూరంగా ఉండాలి.
- వంతెనలపై నుంచి కింద పారుతున్న జలాలను రక్షణ గోడల వద్ద నుంచి చూడాలి. చిన్న రక్షణ గోడలు ఎక్కి చూస్తే నీటిలో పడే ప్రమాదం ఉంది.
- కాజ్‌వేలు, కల్వర్టుపై నుంచి వరద నీరు ఉధృతంగా వెళ్తున్న క్రమంలో వాహనాలతో వెళ్లే ప్రయత్నం చేయవద్దు.
- చెరువుల కట్టలపై, అలుగుల వద్ద వాహనాలు నడవడం, సర్కస్ ఫీట్లు చేయవద్దు.
- చెరువులు, వాగుల్లో ఈత కొట్టవద్దు.



భారీగా ప్రవహిస్తున్న వరద కాలువ

మానీటితో రైతుల వ్యవసాయం

జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో విస్తరించి ఉన్న వరదకాలువ ఆధారంగా రైతులు వేల ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నారు. వరదకాలువ, మానేరునది పరిసరాల్లో మోటార్లు అమర్చుకుని పైపులైన్ల ద్వారా పొలాలు పారిస్తూ పంటలు సాగు చేస్తున్నారు. వీరంతా వరద ప్రవాహం ఉన్న సమయంలో నీళ్లలోకి వెళ్లడం ప్రమాదకరమని అధికారులు చెబుతున్నారు. గంభీరావుపేట మండలం నర్మాల ప్రాంతంలో రైతులు వరద ప్రవాహం లేదనుకుని వెళ్లిన తర్వాత ఒక్కసారిగా వరద రావడంతో చిక్కుకుని అవస్థలు పడ్డారు.

బయటకు వెళ్లవద్దు



వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు. పశువులను, గొర్రెలు, మేకలు మేపడానికి వెళ్లవద్దు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు కంట్రోల్ రూమ్ సేవలు వినియోగించుకోవాలి. కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్ 18002331495కు సమాచారం ఇవ్వాలి.

– సందీప్‌కుమార్ ఝా, కలెక్టర్, రాజన్న సిరిసిల్ల

అందుబాటులో పోలీసులు



మానేరు పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రవహిస్తున్న వాగులు, చెరువుల వద్దకు వెళ్లొద్దు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దు. ప్రజలకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా పోలీస్ శాఖ తగిన ఏర్పాట్లు చేస్తోంది. ఎవరైన ఆపదలో ఉంటే పోలీసులకు సమాచారం అందించాలి. 100 నంబర్‌కు కాల్ చేయాలి.

– మహేశ్ బి గీతే, ఎస్పీ, రాజన్న సిరిసిల్ల

భార్యను హత్య చేసిన భర్తకు యావజ్జీవశిక్ష

జగిత్యాలజోన్: భార్యను హత్య చేసిన భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.2,500 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. రత్నపద్మావతి శుక్రవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్ కథనం ప్రకారం.. రాయికల్ మండల కేంద్రానికి చెందిన అరిపెల్లి సత్తయ్య–లక్ష్మి భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు కాగా, మొదటి కుమారుడు అరిపెల్లి కృష్ణ ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. రెండో కుమారుడు అరిపెల్లి వినోద్ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కుమారులిద్దరూ ఇక్కడ లేకపోవడంతో, వారి భార్యలు వారివారి పుట్టింట్లో ఉంటున్నారు. సత్తయ్య ఏ పని చేయకపోవడమే కాకుండా, ప్రతి చిన్న విషయానికి ఇంట్లో వాళ్లను తిడుతుండేవాడు. సత్తయ్య–లక్ష్మి మధ్య ఎప్పుడు గొడవలు జరిగేవి. దీంతో భార్యాభర్తలు ఒకే ఇంట్లో వేర్వేరుగా ఉన్నారు. కాగా లక్ష్మి తన వైపు కాకుండా, తన కుమారుల వైపు మాట్లాడుతుందని, భార్యపై ప్రతిసారి కోపడుతుండేవాడు. చంపేస్తానని భార్యను బెదిరించడంతో లక్ష్మి మరో చోట ఇల్లు అద్దెకు తీసుకుంది. అక్కడకు వెళ్లి కూడా సత్తయ్య నానా హంగామా సృష్టించేవాడు. ఈ నేపథ్యంలో, ఆగస్టు 8, 2020న చిన్న విషయానికి గొడవపడి, లక్ష్మిని పదునైన కత్తితో గొంతుకోయడంతో మృతిచెందింది. ఈ ఘటనపై మృతురాలి కొడుకు వినోద్ రాయికల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్సై ఆరోగ్యం కేసు నమోదు చేశారు. అప్పటి సిఐ కృష్ణకుమార్ కేసు దర్యాప్తు చేసి, కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు ఎం.కిరణ్‌కుమార్, కె.నరేశ్ బలమైన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో, జడ్జి సాక్ష్యాధారాలను పరిశీలించి నిందితుడు సత్తయ్యకు యావజ్జీవశిక్ష, జరిమానా విధించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇండ్లు దగ్ధం

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణంలోని మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన భీమయ్య, ధర్మయ్యకు చెందిన రెండు ఇళ్లలో గురువారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించగా వారు ఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేశారు. ఇంట్లో ఉన్న నిత్యావసర వస్తువులు, సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.5 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. మాజీమంత్రి జీవన్‌రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. నిత్యావసర సామగ్రి కోసం ఆర్థికసాయం అందించారు. రెవెన్యూ, విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి ప్రభుత్వం తరుపున ఆర్థిక సాయం అందేలా నివేదిక తయారుచేయాలన్నారు.

లోన్ మంజూరైందని రూ.1.50లక్షలు టోకరా

జమ్మికుంట: ముద్ర లోన్ మంజూరైందని, అందుకు డబ్బులు కట్టాలని వాట్సాప్ లింక్ ద్వారా రూ.1.50లక్షలు కాజేసిన సంఘటన జమ్మికుంటలో చోటుచేసుకుంది. టౌన్ సీఐ రామకృష్ణ వివరాల ప్రకారం.. అంకుషాపూర్ గ్రామానికి చెందిన కడిపికొండ శివరెడ్డి అనే వ్యక్తికి ముద్ర లోన్ మంజూరైందని వాట్సాప్ లింక్ వచ్చింది. లింక్ ఓపెన్ చేయగా.. సైబర్ నేరగాళ్లు బ్యాంక్ ఖాతాలోని రూ.1.50లక్షలు కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి పది నెలల జైలు

మెట్‌పల్లి(కోరుట్ల): అజాగ్రత్తగా వాహనం నడిపి ఒకరి మృతికి కారణమైన దుంపటి లక్ష్మీరాజ్యంకు మెట్‌పల్లి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్ పది నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు సీఐ అశోక్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం..ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్‌కు చెందిన రాజుల సాయన్న 2020 ఫిబ్రవరి 25న తన ఆటోలో మేడిపల్లికి వెళ్లి అక్కడ రోడ్డు పక్కన నిలిపాడు. అదే సమయంలో అటు వైపు కారులో లక్ష్మీరాజ్యం అతి వేగంగా వచ్చి వెనుక నుంచి ఆటోను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ సాయన్న తర్వాత చికిత్స పొందుతూ మరణించాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన అప్పటి సీఐ ఎల్.శ్రీను, ఎస్సై అశోక్ పకడ్బందీ సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వాటిని మెజిస్ట్రేట్ పరిశీలించి నిందితుడికి జైలుశిక్ష విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి అనుమతివ్వండి



నిరసన తెలుపుతున్న సరోజన-గజానంద్

మల్లాపూర్(కోరుట్ల): ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని, ఇంటి నిర్మాణానికి గ్రామపంచాయతీ అనుమతి ఇవ్వాలని బాధితులు వేడుకున్న ఘటన మల్లాపూర్ మండలం మొగిలిపేటలో శుక్రవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఓడెల గజానంద్-సరోజన దంపతుల ఇల్లు శిథిలావస్థకు చేరి కూలిపోవడంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. ఆ ఇంటి నిర్మాణానికి గ్రామపంచాయతీ అనుమతి, ఫొటో క్యాప్చర్ కోసం పంచాయతీ కార్యదర్శిని సంప్రదించగా, ఇంటి నిర్మాణ స్థలంపై ఫిర్యాదు వచ్చిందని, ఆ వివాదం పరిష్కారమయ్యే వరకు అనుమతితో పాటు ఫొటో క్యాప్చర్ తీయలేనని సమాధానమివ్వడంతో బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు. తమ సొంత స్థలంలో ఇల్లు కట్టుకునే భాగ్యం లేదా అంటూ బాధితులు నిరసన తెలిపారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి సౌజన్యను వివరణ కోరగా, ఓడెల సరోజన-గజానంద్ దంపతులు నిర్మించుకుంటున్న ఇంటి వెనుక వారితో దారి వివాదం ఉందని తెలిపారు. వివాదం పరిష్కరించుకొని అనుమతి కోసం రావాలని బాధితులకు సూచించామని పేర్కొన్నారు.



మిడ్‌మానేరు వద్ద సెల్ఫీ దిగుతున్న యువకులు



చేపలు పడుతున్న మత్స్యకారులు

మధ్యమానేరు పరవళ్లు

వరుసగా కురుస్తున్న వర్షాలతో మిడ్‌మానేరు ఏడు గేట్లు ఎత్తి ఎల్‌ఎండీలోకి నీటిని వదులుతున్నారు. జల ప్రవాహాన్ని చూసేందుకు వస్తున్న జనం సరదాగా సెల్ఫీలు దిగుతుండగా.. మత్స్యకారులు జీవనోపాధి కోసం అదే వరదలో చేపలు పడుతున్నారు. ఇదే వరదతో గంభీరావుపేట మండలంలో వరిపొలాలు కొట్టుకుపోయాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

కెనాల్‌లో దూకి వ్యక్తి ఆత్మహత్య

కోరుట్లరూరల్: మెట్‌పల్లి పట్టణంలోని రెడ్డి కాలనీకి చెందిన కొయ్యాడ అనిల్ (33) మృతదేహం మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ శివారు కెనాల్‌లో శుక్రవారం సాయంత్రం లభ్యమైనట్లు కోరుట్ల ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. అనిల్ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలంగా ప్రాంకియాసిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. పని చేయలేని పరిపస్థితుల్లో కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మానసిక క్షోభకు గురవుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇంటినుంచి వెళ్లిపోయాడు. శుక్రవారం సాయంత్రం పెద్దాపూర్ శివారు కెనాల్‌లో మృతదేహం లభ్యమైంది. కాగా, తన భర్త ప్రాంకియాసిస్ వ్యాధితో బాధపడుతూ కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పార్వతీ బ్యారేజీకి తగ్గని వరద



బ్యారేజీ నుంచి దిగువకు వెళ్తున్న వరద

మంథనిరూరల్: పెద్దపల్లి జిల్లా మంథని మండలం సిరిపురం సమీపంలోని పార్వతీ బ్యారేజీకు వరద తాకిడి తగ్గలేదు. శుక్రవారం సైతం భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో 8.28లక్షల క్యూసెక్కులు వస్తున్నాయి. పార్వతీ బ్యారేజీ 74 గేట్లు ఎత్తి ఎగువ నుంచి వచ్చే నీళ్లను దిగువకు వదులుతున్నారు. బ్యారేజీలో ప్రస్తుతం 125.780 మీటర్ల ఎత్తులో ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం ఉదయం నుంచి ఇప్పటివరకు ఒకేస్థాయిలో వరద కొనసాగుతుండటంతో పరీవాహక ప్రాంతాల్లోని పంటలు నీటమునిగే ఉన్నాయి. వరద ఉధృతి తగ్గుముఖం పట్టకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా వరద ఉధృతి అలాగే కొనసాగుతుండటంతో అధికారులు పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

స్క్రాప్ తరలిస్తున్న వాహనాల పట్టివేత



సీఐఎస్‌ఎఫ్ అధికారులు పట్టుకున్న వాహనాలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ టౌన్‌షిప్ నుంచి అక్రమంగా తరలిస్తున్న స్క్రాప్‌ను సీఐఎస్‌ఎఫ్ విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. రెండు ట్రాక్టర్ల ద్వారా గురువారం ముగ్గురు స్క్రాప్ తరలిస్తున్నారని సీఐఎస్ఎఫ్ విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది. వెంటనే రంగంలోకి దిగిన అధికారులు.. ప్లాంట్ నుంచి వచ్చిన ట్రాక్టర్, హైడ్రా వాహనాలను నిలిపి తనిఖీ చేయగా సుమారు 170 కేజీల స్క్రాప్ లభించింది. ఈమేరకు ట్రాక్టర్ డ్రైవర్ ఎ.సతీశ్, హైడ్రా డ్రైవర్ గుడ్డు కుమార్‌సింగ్, క్రేన్ ఆపరేటర్ కబీర్ అన్సారీని అదుపులోకి తీసుకున్నారు. రెండు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల కోసం ఎన్టీపీసీ హెచ్‌ఆర్ అధికారులకు స్క్రాప్ అప్పగించారు.

కొదురుపాకలో రెండిళ్లలో చోరీ

- బంగారు, వెండి నగలు అపహరణ



బీరువాలో చిందర వందరగా వస్తువులు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కొదురుపాకలో గురువారం అర్ధరాత్రి రెండిళ్లలో జరిగిన చోరీలో బంగారు, వెండి నగలను దొంగలు ఎత్తుకెళ్లారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. కొదురుపాకకు చెందిన నాగుల లక్ష్మీరాజం, ధ్యావనపల్లి సుధాకర్‌రావు ఇళ్లలో దొంగలు చొరబడ్డారు. నాగుల లక్ష్మీరాజం ఇంట్లో 30 తులాల వెండి పట్టీలు, ధ్యావనపల్లి సుధాకర్‌రావు ఇంట్లో తులం బంగారుగుండ్లు, అర తులం కమ్మల జతలు, 20 తులల వెండి పట్టీలు ఎత్తుకెళ్లారు. ఎస్సై రమకాంత్ సంఘటన స్థలానికి చేరుకొని, క్లూస్ టీంతో వివరాలు సేకరించారు.

కాళ్లకు ఇన్‌ఫెక్షన్.. వైద్యం కోసం నిరీక్షణ

- ఆపరేషన్‌కు రూ.14లక్షలు అవసరం
- చికిత్స చేయించలేక.. నిమ్స్ వరండాలో కుటుంబ సభ్యులు
- దాతల సాయం కోసం వేడుకోలు



నిమ్స్ వరండాలో ఉన్న పేషెంట్, కుటుంబ సభ్యులు

జూలపల్లి(పెద్దపల్లి): ఖరీదైన వైద్యం చేయించుకునే స్థోపతలేని ఓ పేద కుటుంబం ఆపన్నహస్తం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ వరండాలో తలదాచుకుంది. దాతల సాయం కోసం దీనంగా ఎదురు చూస్తోంది. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన పులిపాక నర్సయ్య రెండు కాళ్లకు ఇటీవల ఇన్‌ఫెక్షన్ సోకింది. స్థానికంగా వైద్యం చేయించినా నయం కాలేదు. దీంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు వెళ్లారు. పరీక్షించిన వైద్యులు.. రెండుకాళ్లకు ఆపరేషన్ చేయాలని, ఇందుకోసం సుమారు రూ.14 లక్షల వరకు ఖర్చవుతుందని వెల్లడించారు. చేతిలో చిల్లిగవ్వలేని బాధిత కుటుంబం.. తొలుత పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావును కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే.. సీఎం సహాయ నిధి నుంచి రూ.1.50లక్షలు ఇచ్చేందుకు ఉత్తర్వులు మంజూరు చేయించారు. మిగతా డబ్బుల కోసం బాధిత కుటుంబం దాతల కోసం వేయికళ్లతో ఎదురు చూస్తోంది. ప్రస్తుతం చికిత్స ఏమీ లేకపోవడంతో నిమ్స్ వరండాలోనే కాలం వెళ్లదీస్తోంది. సకాలంలో ఆపరేషన్ చేయకుంటే రెండుకాళ్లు తొలగించే అవకాశం ఉందని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. దాతలు ముందుకు రావాలని వారు వేడుకుంటున్నారు.

బార్ అండ్ రెస్టారెంట్లలో తనిఖీలు

- నిల్వ పదార్థాలు గుర్తింపు



నిల్వ ఉన్న ఆహార పదార్థాలు

కరీంనగర్ అర్బన్: ఫుడ్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. బస్టాండ్ పక్కన గల నటరాజ్ బార్, దర్బార్ బార్‌లో గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పి.రోహిత్‌రెడ్డి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ వి.అంకిత్‌రెడ్డి తనిఖీలను నిర్వహించారు. దర్బార్ బార్‌లో ముందు రోజు మిగిలిన మటన్, కార్న్, వెజ్ మంచూరియాను గుర్తించారు. హైజీన్ లోపాలు గుర్తించగా నోటీసులు జారీ చేశారు. అలాగే నటరాజ్ బార్‌లో పరిసరాల పరిస్థితి అధ్వానంగా ఉన్నట్లు గుర్తించామని అధికారులు వివరించారు. కిచెన్ దుర్వాసన రాగా, సిబ్బంది ఎటువంటి ఆహార భద్రత జాగ్రత్తలు పాటించకపోవడంతో నోటీస్ జారీ చేసినట్లు వివరించారు.






రాజన్నకు మొక్కులు

వేములవాడ : రాజన్నను శుక్రవారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల ద్వారా రూ.16లక్షల ఆదాయం సమకూరింది. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి రాజన్నను దర్శించుకున్నారు. ఆలయంలోని ఓపెన్‌స్లాబ్, కల్యాణకట్ట, మెయిన్ టెంపుల్ పరిసర ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఆలయ ఈఈ రాజేశ్, డీఈలు రఘునందన్, మైపాల్‌రెడ్డి, ఏఈవో శ్రావణ్‌కుమార్, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, వెల్ది సంతోష్, ఆలయ ఇన్‌స్పెక్టర్ నూగురి నరేందర్ ఉన్నారు.

స్పటిక లింగాలతో వినాయకుడు



స్పటిక లింగాల వినాయకుడు

విఘ్నాలు హరించే వినాయకుడి నవరాత్రి ఉత్సవాలు ఉత్సాహంగా నిర్వహించుకుంటున్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో 36వ వార్డు వెంకంపేట రాంలాల్ మండప్ నిర్వాహకులు స్పటిక లింగాలతో వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మహారాష్ట్రలో కోల్‌కత కళాకారులతో రూ.2 లక్షలకు పైగా వెచ్చించి ఈ విగ్రహాన్ని తయారు చేయించారు. పర్యావరణానికి హాని కలుగకుండా పూర్తిగ బంక మట్టి, కర్రలు, గడ్డితో ఎలాంటి రసాయనాలు వాడకుండా ఈ విగ్రహాన్ని తయారు చేయించారు. 10,116 స్పటిక లింగాలతో వినాయకుడి విగ్రహాన్ని తయారు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల